www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 10 నవంబర్ 2022
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



శస్త్రచికిత్సలు విజయవంతం

నెల్లూరు :చెన్నయ్‌కి చెందిన గ్లెనీగల్స్ గ్లోబల్ హెల్త్ సిటీలో వంద మంది చిన్నారులకు లివర్ మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించామని డాక్టర్ రజనీకాంత్ పచ్చ తెలిపారు. బుధవారం నగరంలోని ఓ అతిథి గృహంలో గ్లెనీగల్స్ గ్లోబల్ వైద్యశాల యాజమాన్యం విలేకర్ల సమావేశం నిర్వహించింది. సీనియర్ లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జన్ డాక్టర్ రజినికాంత్ పచ్చ మాట్లాడుతూ అతి తక్కువ వయస్సు కలిగి, తక్కువ బరువు కలిగిన వంద మంది చిన్నారులకు విజయవంతంగా శస్త్ర చికిత్సలు నిర్వహించామన్నారు. కలుషితమైన పదార్థాలు విసర్జితమై న్యూట్రియంట్‌లు శరీరంలోకి ప్రవేశిస్తాయన్నారు. ఈ సమస్యను ప్రారంభ దశలో గుర్తించి వైద్యుడి సలహాలు సూచనలు మేరకు శస్త్ర చిక్తిత్సలు నిర్వహించుకోవడం వల్ల అప్పుడే జన్మించిన పిల్లల్లో కామెర్ల కారణంగా కాలేయం దెబ్బతినడం సమస్యను అధిగమించవచ్చున్నారు. గ్లెనీగల్స్ గ్లోబల్ హెల్త్ సిటీ యాజమన్యాం నుంచి వాకా భాస్కర్‌రెడ్డి, పలువురు ఈ వైద్యశాలలో తమ పిల్లలకు చికిత్సలు తీసుకొన్న తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైద్యులు

ఎపి జెన్కో కార్మికుల సుదీర్ఘ పోరాటం..!

◆300 రోజులకు చేరిన ఆందోళనలు ◆నేడు టెండర్లకు ఆహ్వానం

ప్రభుత్వానికి చెవిటి వాని ముందు శంఖం ఊదినట్లు ఉంది. రాష్ట్ర ప్రయోజనం కోసం, కార్మికులు, స్థానికుల హక్కుల కోసం ఎపి జెన్కో సూపర్ క్రిటికల్ థర్మల్ ప్రాజెక్టును అమ్మకానికి పెట్టవద్దంటూ కార్మికులు చేస్తున్న పోరాటం నేటితో 300 రోజులకు చేరింది. న్యాయమైన కోర్కెల సాధన కోసం ఇంత పెద్ద ఎత్తున ప్రజలు, కార్మికులు, రాజకీయ పార్టీలు ఆందోళన చేస్తుంటే కనీసం పట్టించుకోవడం లేదు. నేడు బహిరంగ టెండర్లకు ఆహ్వానం పలికారు. ముత్తుకూరు, టిపి గూడూరు మండల పరిధి ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదు. ఎపి జెన్‌కో థర్మల్ ప్రాజెక్టు వస్తే నిరుద్యోగ యువతికి, ఉపాధి, ఉపాధి దొరుకుతుందని ఆశపడ్డారు. తమ భూములను ఇచ్చారు. సుమారు రూ.21 వేల కోట్లతో నిర్మించిన ఈ ప్రాజెక్టును ప్రయివేటు వ్యక్తుల చేతిలో పెట్టడానికి సర్వం సిద్ధం చేశారు. కార్మికులు, ప్రజలు వద్దంటున్నా పట్టించుకోకుండా, నేడు టెండర్లకు పిలిచారు. కార్మికులు నిర్వహిస్తున్న పోరాటం సుదీర్ఘంగా 300 రోజులకు చేరింది.

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

కృష్ణపట్నం (దామోదరం సంజీవయ్య థర్మల్ ప్రాజెక్టు) ఎపి జెన్కోను ప్రధాని నరేంద్ర మోడీ కోరిక మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మకానికి పెట్టారు. గత ప్రభుత్వ హయాంలో సుమారు రూ.21 వేల కోట్లతో అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సూపర్ క్రిటికల్ థర్మల్ ప్రాజెక్టును 2006లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తే రాష్ట్ర విద్యుత్ అవసరాలు తీరుతాయని చెప్పారు. 2015లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి ఎం.వెంకయ్య నాయుడు దీనికి సంబందించి 800 మెగావాల్ట్ చొప్పున రెండు యూనిట్లు ప్రారంభించారు. టిపి గూడూరు, ముత్తుకూరు ప్రాంతానికి చెందిన రైతుల నుంచి భూములు తీసుకున్నారు. ఈ ప్రాంతంలో 33 వేల ఎకరాల్లో, 33 వేల మెగావాల్ట్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ప్రాజెక్టులకు అనుమతులు వచ్చాయి. ఈ ప్రాంతమంతా కాలుష్యకోరల్లో చిక్కుకుంటుందని తెలుసు. తమ ఆరోగ్యాలు క్షీణిస్తా యని అప్పటి సైన్స్ సంస్థలు హెచ్చరికలు జారీ చేశాయి. అయినప్పటికీ ఉపాధి, ఉద్యోగం ఇస్తామని, పునరావాసం కలిగిస్తామని, ప్రభుత్వం హామీ ఇచ్చింది. అప్పటి నుంచి ఈ ప్రాంతాల్లో ప్రాజెక్టు లొచ్చినా స్థానికులకు ఉపాధి, ఉద్యోగం సరిగా దక్కలేదు. పునారావాసం ఊసేలేదు. 2015లో ఒక్కో యూనిట్ 800 మెగావాల్ట్ చొప్పున మూడు యూనిట్లకు శంకుస్థాపన చేశారు. 800 మెగావాల్ట్ సామర్థ్యంతో గతంలో రెండు యూనిట్లు ప్రారం భించారు. గత నెల 26న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 800 యూనిట్స్ , మూడో యూనిట్ ప్రారంబించారు. ప్రస్తుతం ప్రాజెక్టు బాగా పనిచేస్తుంది. నష్టాలు వస్తున్నాయని సాకుతో దీనిని ప్రయివేటీకరించడానికి సిద్ధమ య్యారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులో 1200 మంది అవుట్ సోర్సింగ్ కార్మికులు, 338 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. బాగా పనిచేస్తున్న ప్రాజెక్టును ఈ ఏడాది జనవరి 21న రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేటు వ్యక్తులకు 25ఏళ్ల లీజుకు ఇవ్వాలని నిర్ణయించింది. మొత్తం ప్రాజెక్టులో 27 శాతం వాటా తెలంగాణ ప్రభు త్వానిది. ప్రయివేటీకరణను ఆ ప్రభుత్వం వ్యతిరేకిస్తుంది. గత నెల 20న బిడ్స్‌కు ఆహ్వానిం చారు. ముఖ్యమంత్రి గత నెల 26న జిల్లాకు రావడంతో దానిని వాయిదా వేసుకున్నారు. నేడు బహిరంగ టెండర్లును ఆహ్వానించారు.

300 రోజుకు చేరిన కార్మికుల ఆందోళనలు

ఎపి జెన్కో పరిరక్షణ కమిటీ పేరుతో కార్మికులు చేపట్టిన ఉద్యమం నేటితో 300 రోజుకు చేరింది. ఈ ఏడాది జనవరి 21న ప్రభుత్వ నిర్ణయంతో కార్మికులు ఆందోళన బాటపట్టారు. అప్పటి నుంచి ప్రతి రోజూ ఏదొక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఉద్యోగులు, కార్మికులు రోజు తమ విధులు నిర్వహిస్తూనే, పోరాటం సాగిస్తున్నారు. ఒక్క వైసిపి మినహా అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక, ప్రజా సంఘాలు ఈ పోరాటానికి మద్దతుగా నిలిచాయి. నిర్వాసితులకు ఇచ్చిన హామీలు నెరవేర్చని పర్మినెంట్ ఉద్యోగాలు ఇవ్వాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, పునరావాస కాలనీలు ఏర్పాటు చేసి, గ్రామాలు తరలించాలని, ఆరు సంవత్సరాల నుంచి ఆందో ళనలు నిర్వహి స్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఇప్పుడు ప్రాజెక్టును అదానీకి కట్టబెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. నేడు టెండర్లు ఆహ్వానాన్ని నిరసిస్తూ జెన్‌కో ప్రాజెక్టు వద్ద నేడు సభ నిర్వహిం చనున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా దిగిరాకపోతే పోరాటం మరింత ఉధృతం చేస్తామని రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు హెచ్చరికలు జారీ చేశాయి.

సివిల్ సప్లయ్ కేసు ఎసిబికి..!

శివకుమార్ ఇంట్లో సోదాలు - ఏకకాలంలో 10చోట్ల ఎసిబి దాడులు

డిఎం సివిల్ సప్లయ్ కార్యాలయంలో జరిగిన అవినీతి కేసును ఎసిబికి అప్పగించారు. నెల్లూరు ఎసిబి డిఎస్‌పి మోహన్ నేతృత్వంలో నెల్లూరులో ఏడుచోట్ల, పక్క జిల్లాలో మరో మూడు చోట్ల బుధవారం ఉదయం నుంచి సోదాలు నిర్వహించారు. ఈ కేసులో మొత్తం 32 మంది పేర్లు బయటకొచ్చాయి. ఇప్పటి వరకు 11 మందిపై కేసు నమోదు చేశారు. జెసి కూర్మానాథ్ తుది నివేదికను కలెక్టర్, సివిల్ సప్లయ్ అధికారులకు అందజేశారు. ఇందులో కీలకమైన వ్యకిగా ఉన్న శివకుమార్, పవన్, రాజులను గత గురువారం రాత్రి అరెస్ట్ చేసి, డిఎం పద్మతోపాటు మరో ఇద్దరు అధికారులను అరెస్ట్ చేశారు ఈ నెల 6న ఈకేసును ఉన్నతాధికారులు ఎసిబికి అప్పగించారు. ఎసిబి అధికారులు దాడులు తీవ్ర తరం చేశారు. ఏం జరుగుతుందో చూడాలి. జైల్లో ఉన్న డిఎం పద్మకు వివిపి ట్రీట్‌మెంట్ ఇవ్వాలంటూ ఆమెకు చెందిన వ్యక్తులు జిల్లా జైలు వద్ద హల్ చల్ చేసినట్లు తెలిసింది.

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

సివిల్ సప్లయ్ డిఎం కార్యాలయంలో జరిగిన అవినీతి కేసును రాష్ట్ర ఉన్నతాధికారులు ఎసిబికి అప్పగించింది. రాష్ట్ర ఎసిబి అధికారుల ఆదేశాల మేరకు ఈనెల 6 వతేదీ నుంచి జిల్లా ఎసిబి డిఎస్‌పి మోహన్‌రావు నేతృత్వంలో బృందాలు ఈ కేసుతో సంబంధం ఉన్న సివిల్ సప్లయ్ అధికారులు, ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, బయట వ్యక్తులకు సంబంధించిన వివరాలు స్వీకరిస్తున్నారు. బుధవారం ఉదయం నుంచి పది చోట్ల దాడులు నిర్వహించారు. ఈ కేసులో కీలకమైన వ్యక్తిగా ఉన్న ఎస్.శివకుమార్ ఉంటున్న ధనలక్ష్మీపురంలోని ఆయన నివాసానికి వెళ్లారు. ఇంట్లో సోదాలు నిర్వహించారు. పలు కీలకమైన రికార్డులు స్వాధీనం చేసుకున్నారని తెలుస్తోంది. వేదాయపాళెంలో ఉంటున్న డిఎం పద్మ నివాసానికి వెళ్లారు. ఇనమడుగు, కోవూరు, నెల్లూరు, వేదాయపాళెం, గూడూరు, ప్రాంతాల్లో మొత్తం పది చోట్ల దాడులు నిర్వహించారు. అన్నిచోట్ల ఏమైనా రికార్డులు దొరుకుతాయనే అంశాలను పరిశీలిస్తున్నారు. ఇప్పటికే జెసి కూర్మానాథ్ సుమారు 25 రోజులు విచారణ చేపట్టారు. అందులో అనేక విషయాలను బయటకొచ్చాయి. ఇందులో ప్రధానంగా రూ.40 కోట్లు అవినీతి జరిగిందని, రికార్డుల ఆధారంగా గుర్తించారు. ఇది కాకుండా మరికొంత లెక్కల్లో తేలాల్సి ఉంది. తొలి విడతగా సివిల్ సప్లయ్ ఆడిట్‌లో బయటపడిన రూ.29.78 కోట్లకు సంబంధించి అక్టోబర్ 14న జెసి 11 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. సివిల్‌సప్లయ్ అధికారుల ఆడిట్ వివరాలు మేరకు దీనిని గుర్తించారు.. సివిల్ సప్లయ్ అధికారులు ఇంటర్‌నల్ ఆడిట్‌లో వచ్చిన సమాచారం మేరకు 2020-21 ఆర్థిక సంవత్స రంలో రూ.6,52,41,821లు, 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.15,70,51,594లు, 2022-23 ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ వరకు రూ.7,55,35,389లు అవినీతికి పాల్పడ్డారు మొత్తం రూ.29.78 కోట్లుగా తొలుత గుర్తించి కేసు నమోదు చేశారు. పొదుపు సమైఖ్యలకు చెల్లించాల్సిన రూ.10.41 కోట్లల్లో రూ.7.60 కోట్లు మాయమైనట్లు అధికారులు తేల్చారు.తొలిత రూ.4.50 కోట్లు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌లోనూ, మరో మొత్తం మరో బ్యాంక్‌లో డిపాజిట్ చేశారు. ఈ మొత్తం వ్యవహారం 2016 నుంచి ఇప్పటి వరకు పనిచేసిన డిఎంల ఆధ్వర్యంలో జరిగినట్లు ప్రాథమిక జెసి విచారణలో తేలింది. జెసి విచారణలో రూ.40 కోట్లు అవినీతి బయట పడింది. మరో రూ.25 కోట్లు తేలాల్సి ఉంది. ఎసిబి అధికారులు కేవలం రూ. 29,78 కోట్లకు సంబందించి విచారణ జరుపుతున్నారు. ఈ కేసును మరింత లోతుగా విచారణ చేస్తే అనేక విషయాలు బయటకొస్తాయని తెలుస్తోంది.

అధికారుల దాడుల్లో బయటపడ్డ విలువైన వస్తువులు

దాడులు నిర్వహిస్తున్న అధికారులు

ఇప్పటి వరకు ఆరుగురు అరెస్ట్..!

సివిల్ సప్లయ్ కేసును ఎస్‌పి విజయరావు విజ్ఞప్తి మేరకు ఎసిబి తీసుకుంది. ఈ కేసులో మొత్తం రూ.40కోట్లు అవినీతికి సంబంధించి 32 మందికి సంబందాలున్నట్లు జెసి తన నివేదికలో పేర్కొంది. అక్టోబర్ 14న రూ.29.78 కోట్లకు సంబంధించి 11 మందిపై 5వ నగర పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఇందులో పోలీసులు ఇప్పటి వరకు ఆరుగురిని అరెస్ట్ చేశారు. తొలుత అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఎస్.శివకుమార్, ప్రయివేటు వ్యక్తులు పవన్, రాజాలను అరెస్ట్ చేశారు. రెండురోజుల క్రితం డిఎం పద్మతోపాటు శర్మ, మరో ఉద్యోగిని అరెస్ట్ చేశారు. ప్రస్తుతం వారు నెల్లూరు సెంటర్ జైల్లో ఉన్నారు. 26 మందిని అదుపులోకి తీసుకోవాల్సి ఉంది. 2016 నుంచి డిఎం సివిల్ సప్లయ్ కార్యాలయంలో పనిచేసిన అధికారులు, ఉద్యోగులు ఇందులో కీలకంగా ఉన్నారు. ఇప్పుడు ఎసిబి ఈ కేసులు చేస్తుం డడంతో అందరినీ అదుపులోకి తీసుకునే అవకాశాలు న్నాయి. ప్రస్తుతం జైల్లోని డిఎం పద్మకు బయట నుంచి ఆహారం అందిం చేందుకు కొందరు ప్రయత్నాలు చేశారు. దీనిని జైలు అధికారులు ఒప్పుకోకపోవడంతో వివాదానికి దిగినట్లు తెలిసింది. అధికారులు బయట వ్యక్తులను అనుమతించలేదని తెలిసింది. ఈ కేసులో మరింత మంది బయటకొచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పది చోట్ల సోదాలు..!

సివిల్ సప్లయ్ కేసులో ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు పది చోట్ల దాడులు జరిపినట్లు డిఎస్‌పి మోహన్‌రావు తెలిపారు. నెల్లూరు నగరం, ధనలక్ష్మీపురం, కోవూరు, ఇనమడుగు, గూడూరు తదితర ప్రాంతాల్లో సోదాలు చేశామని తెలిపారు.

వైసిపి నాయకుల ఆరోపణలు అవాస్తవం

కందుకూరు :కందుకూరు పట్టణ వైసిపి అధ్యక్షులు షేక్ రఫీ ముస్లిములపై కుటిల, కుయుక్తుల రాజకీయం చేస్తున్నారని, ఆయన టిడిపి ఇన్‌ఛార్జి, నేతలపై చేసిన ఆరోపణలు అవాస్తవమని టిడిపి ముస్లిం మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ రఫీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కందుకూరులోని పోస్ట్ ఆఫీస్ సెంటర్లో ట్రాఫిక్ సమస్యలు ఉన్నాయన్నారు. బండ్ల పార్కింగ్ స్థలము వద్ద చిరు వ్యాపారం చేసుకునే వ్యాపారులందరినీ ఖాళీ చేయించింది ప్రస్తుతం ఉన్న ఎంఎల్ఎ కాదా అని ప్రశ్నించారు. వైసిపి నాయకులు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు. ముస్లిములపై నిజంగా అంత దయ, ప్రేమ ఉంటే వారికి రావాల్సిన పథకాలు, అభివృద్ధిపై మాట్లాడాలన్నారు. నాలుగేళ్ల నుంచి దుల్హన్ పథకం రావడం లేదని, వాటి మీద ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు.

లోకేష్‌ను కలిసిన కంచర్ల శ్రీకాంత్

కందుకూరు :తూర్పు రాయల సీమ పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ బుధవారం టిడిపి యువ నాయకులు నారా లోకేష్‌ను ఉండవల్లి తన నివాసంలో మర్యాదపూ ర్వకంగా కలిశారు. త్వరలో జరగబోయే పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ పట్ట భద్రుల ఎంఎల్‌సి ఎన్నికలపై సమీక్ష జరిగిం దన్నారు. ఏఏ నియోజకవర్గంలో ఎన్ని ఓట్లు నమోదు అయ్యా యని విషయాలు చర్చకి వచ్చా యని తెలిపారు. ఓట్ల వెరిఫికేషన్ అనంతరం మళ్లీ ఏ విధంగా ఓట్లు నమోదు చేయాలనే అంశం మీద నారా లోకేష్ చర్చించారని తెలిపారు. టిడిపి నాయకులు కార్యకర్తల సమన్వయంతో తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా విజయం సాధించాలని లోకేష్ ఆకాంక్షించారని తెలిపారు.

లోకేష్‌ను కలిసిన శ్రీకాంత్

నగర అభివృద్ధి శూన్యం : టిడిపి

నెల్లూరు : ఇరిగేషన్ శాఖ మంత్రిగా పి.అనిల్ కుమార్ బాధ్యతలు నిర్వహించిన సమయంలో నగరాభివృద్ధి పెద్దగా చేసిందేమీ లేదని, నేడు నగర నియోజకవర్గంలో పాదయాత్రలు చేస్తున్న సమయంలో చెత్తపన్ను విధానం ప్రభుత్వం వెన్నక్కు తీసుకొనేలా కృషి చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని టిడిపి నగర ఇన్‌ఛార్జి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం ఆయన నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో మాట్లాడారు. నిత్యం ప్రమాదాలకు కేరాఫ్ గా మారిన సింహపురి హాస్పటల్ జంక్షన్ వద్ద ఉన్న బార్ ను మూసెయ్యకపోతే పెద్ద ఎత్తున ఆందోలన చేస్తామని కోటంరెడ్డి హెచ్చరించారు. సత్యనాగేశ్వర రావు, మామిడాల మధు, ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, ప్రశాంత్, కువ్వారపు బాలాజీ, జాఫర్ షరీఫ్, జహీర్, పుట్టా అజయ్ రెడ్డి, వినుకుల సుధాకర్ రాజు పాల్గొన్నారు.

దిక్కుతోచని స్థితిలో వ్యవసాయ కార్మికులు

నెల్లూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల వల్ల వ్యవసాయ కార్మికుల జీవన పరిస్థితులు అగమ్యగోచరంగా మారిపోయాయని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.పుల్లయ్య విమర్శించారు. బుధవారం నగరంలోని డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్‌లో ఆయన మాట్లాడారు. జిల్లాలోని దామరమడుగు ప్రాంతంలో వ్యవసాయ కార్మిక సంఘం 19 మహాసభ నిర్వహించుకున్నామన్నారు. ఈ మహాసభల్లో వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభల్లో చర్చించుకోవడం జరిగిందన్నారు. కూలీలకు చేతినిండా పనిలేకపోవడం వల్ల కడుపు నిండా తిండి తినలేని దుస్థితిని ఎదుర్కొంటున్నారన్నారు. ప్రధానంగా ఉపాధి హామీ పథకం పేద కార్మికుల జీవనోపాధికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వ కుటిల ప్రయత్నాలను తిప్పికొట్టే విధంగా వ్యవసాయ కార్మికులు పోరాటానికి సిద్ధపడాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నూతన అధ్యక్షులు జొన్నలగడ్డ వెంకమరాజు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

గుడ్లూరు : మండలంలోని పెద్దలాటరపి దగ్గర ఉన్న ఏరులో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకలోడు చేసుకొని కావలి తరలిస్తుండగా సబ్ ఎస్క్మి మౌలాలి ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేసి బుధవారం సీజ్ చేశారు. మండలంలోని నరసాపురానికి చెందిన జి శీను, సతీష్ తమ ట్రాక్టర్లతో ఇసుక లోడు చేసుకొని తరలిస్తుండగా పట్టుకన్నారు.ట్రాక్టర్లను స్టేషన్‌ఖు తరలించారు.

ఓటర్ల నమోదుపై అభ్యంతరాలు స్వీకరణ

నెల్లూరు : నగర పాలక సంస్థ పరిధిలోని ఓటర్ల నమోదు, అభ్యంతరాలు, మార్పు చేర్పుల వివరాలను నేటి నుంచి డిసెంబర్ నెల 8 వ తేదీ వరకు చేపట్టనున్నామని కమిషనర్ హరిత తెలియజేసారు. స్థానిక ఈ.ఎస్.ఆర్.ఎమ్ పాఠశాలలో స్పెషల్ సమ్మరీ రివిజన్ - 2023 కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. తహశీల్దార్ నిర్మలానంద బాబా, డిప్యూటీ తహశీల్దార్ శైలజా కుమారి, బి.ఎల్.ఓ సూపర్వైజర్ కష్ణ కిషోర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలి : డివైఎఫ్ఐ

నెల్లూరు :భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) 42వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా బుధవారం నగరంలో మన్సూర్ నగర్ కుదుస్ నగర్ కోటమిట్ట ప్రాంతాలలో డివైఎఫ్ఐ జెండాలు ఆవిష్కరించారు. నగర కార్యదర్శి నరసింహ మాట్లాడుతూ డివైఎఫ్ఐ ఏర్పడి 42 సంవత్సరాల గడిచాయని అప్పటినుండి ఇప్పటివరకు యువజన సమస్య మీద పోరాడే ఏకైక సంఘం డివైఎఫ్ఐ అని ఉద్ఘాటించారు నెల్లూరు నగరంలో మతోన్మాదానికి ,రౌడీయిజానికి, స్కిల్ గేమ్స్ వ్యతిరేకంగా డివైఎఫ్ఐ ఎన్నో సమరశీల పోరాటం నిర్వహించిందని తెలిపారు. జెన్కోను లీజు పేరుతో ఆదానికి అప్పజెప్పడాన్ని డివైఎఫ్ఐ వ్యతిరేకిస్తుందని దానిని ప్రభుత్వాంగంలోని కొనసాగించాలని కొనసాగించే వరకు డివైఎఫ్ఐ పోరాటం చేస్తుందని తెలిపారు రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలకు సంబంధించిన జాబ్ క్యాలెం డర్‌ను వెంటనే ప్రకటించాలన్నారు. మెగా డీఎస్సీ ని నిర్వహించి ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ భర్తీ చేయాలని డిమాండ్ చేశారు జిల్లా కమిటీ సభ్యులు ఫయాజ్ నగర నాయకులు జహీర్ బాలు మాజీ నాయకులు ఇస్మాయిల్ హమాయిన్ పాల్గొన్నారు.

అపోలో సెంటర్‌లో :డివైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని అపోలో సెంటర్లో డివైఎఫ్ఐ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా రూరల్ డివైఎఫ్ఐ కార్యదర్శి కోటేశ్వరరావు పాల్గొని జెండా ఆవిష్కరించారు. గతంలో కలిసి పని చేసినటువంటి డివైఎఫ్ఐ సానుభూతిపరులు కార్యకర్తలని ఈ సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో 17 సిపిఎం శాఖ కార్యదర్శి కె. సతీష్ శాఖ సభ్యులు ఎస్‌కె నజీర్ , బి ప్రసాద్ ,ఎం మధు ఆ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు మదన్ భాస్కర్ శీను 50 మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్షర చైతన్యం -2 కార్యక్రమంపై శిక్షణ

లింగసముద్రం : మండలంలో ఉన్న నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దమే లక్ష్యంగా పెట్టుకొని పని చేయాలని ఎంపిడిఓ కట్టా శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యలయంలో బుధవారం పంచా యితీ కార్యదర్శులు, మహిళ పోలీసులు, వేల్ఫేర్ అసిస్టెంట్‌లకు శిక్షణ జరిగింది. ఎంపిడిఒ మాట్లాడుతూ అక్షర చైతన్యం-2 కార్యక్రమంలో భాగంగా అందరూ గ్రామాల్లో నిరక్షరాస్యులను గుర్తించి వారి వివరాలను సేకరించాలని చెప్పారు ఎంఇఓ కె.రవికుమార్, ఈఓపిఆర్‌డి జె.శ్రీనివాసులురెడ్డి, పర్య వేక్షకులు వెంకటరెడ్డి, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

లింగసముద్రంలోమాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీనివాసులు

కలువాయి : అక్షర చైతన్యం ఫేస్-2 లో భాగంగా ఎంపిడిఒ కార్యాలయంలో మహిళా పోలీసులు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లకు అడల్ట్ ఎడ్యుకేషన్ పర్య వేక్షకులు ఎల్ రామకుమార్ శిక్షణఇచ్చారు. జెడ్‌పిటిసి అనిల్ కుమార్ రెడ్డి మండల పరిషత్ అభివద్ధి అధికారి నారాయణ ఎంఇఒ సుధీర్ బాబు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో విద్యార్థుల విజయకేతనం

పొదలకూరు :విక్రమ సింహపురి యూనివర్సిటీ ఈనెల 7న ప్రకటించిన డిగ్రీ మొదటి సంవత్సరం(ఫస్ట్ సెమిస్టర్) పరీక్షా ఫలితాలలో పొదలకూరు లోని ఎస్‌పిబివిడి డిగ్రీ కాలేజీ విద్యార్థులు ఘన విజయం సాధించారు. మొదటి సంవత్సరం (ఫస్ట్ సెమిస్టర్) లో బిఎస్సీ గ్రూపులో జి. నాగ సాయి 9.47, బికాం గ్రూపులో కె. నాగలక్ష్మి 9.27 గ్రేట్ పాయింట్లతో పొదలకూరు మండల ప్రథమ స్థానాలను కైవసం చేసుకున్నారని కళాశాల డైరెక్టర్ సిహెచ్. శంకర్ రెడ్డి, ఆ కళాశాల ప్రిన్సిపాల్ డి. ఉదయ్ భాస్కర్ రెడ్డి తెలిపారు. ఎన్. జస్వంతి బిఎస్సి గ్రూప్ నందు 9.39, వి. శివగ్రీష్మ బిఎస్సీ గ్రూప్‌లో 9.15 గ్రేడ్ పాయింట్లతో కళాశాల ద్వితీయ స్థానాలను పొందారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను, అధ్యా పకులను ప్రిన్సిపాల్ అభినందనలు తెలిపారు. ఎస్‌పి బివిడి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కే.కోటేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



'అపోలో' ఆస్పత్రిలో సుగర్ క్లినిక్ ప్రారంభం

నెల్లూరు : నగరంలోని అపోలో వైద్యశాల యాజమాన్యం షుగర్ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేకంగా వైద్యసేవలందించేందుకు క్లినిక్‌లను నగరంలో ప్రారంభించింది.బుధవారం అపోలో వైద్యశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో క్లినిక్‌ల వివరాలు వెల్లడించారు. ముత్తుకూరు రోడ్డు ,రాంజీ నగర్, పినాకిని అవెన్యూలో ఏర్పాటుచేసిన అపోలో షుగర్ క్లినిక్ ను నెల్లూరు అపోలో ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, అపోలో షుగర్ క్లినిక్స్ ఆపరేషనల్ హెడ్ పి.కష్ణ నెల్లూరు అపోలో ఆసుపత్రి సీనియర్ ఎండో క్రెయినాలజిస్టులు డాక్టర్ నిషితా రెడ్డి, డాక్టర్ రామ్మోహన్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల 30 నిమిషాల వరకు ఈ షుగర్ క్లినిక్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. నెల్లూరులోని కొత్త క్లినిక్ మధుమేహాన్ని నిర్వహించడానికి, చికిత్స అందజేయడం ద్వారా వ్యాధిగ్రస్తులకు ఎదురైయ్యే పలు ఆరోగ్య సమస్యలపై పరిష్కారాలను అందిస్తుందన్నారు. జిల్లా షుగర్ వ్యాధిగ్రస్తులకు మెరుగైన సేవలను అందించాలన్న సంకల్పంతో అపోలో షుగర్ క్లినిక్ ను నగరంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అపాయింట్మెంట్ కొరకు 1800 103 10 10 మా టోల్ ఫ్రీ నంబర్ను సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అపోలో ఆసుపత్రి వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు

రైతులకు అవగాహన

కలువాయి : మండలంలోని ఉయ్యాలపల్లిలో రైతులకు విద్యుత్‌పై అవగాహన సదసు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమనికు ముఖ్య అతిథిగా విద్యుత్ అధికారి సుబ్బారావు పాల్గొన్నారు. రైతులు తమ పొలాలలో బిగించే ట్రాన్స్‌ఫార్మర్లను తమ సొంత ఆస్తిగా భావించి జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. చోరీకి గురికాకుండా చూసుకోవాలన్నారు. యశ్వంత్, ప్రసాద్, శ్రీనివాసులు గ్రామ రైతులు పాల్గొన్నారు.

కులదూషణ కేసుపై డిఎస్‌పి విచారణ

తోటపల్లిగూడూరు : ఓ దళిత మహిళను కులం పేరుతో దుర్భాషలాడి, చంపుతానంటూ బెదిరింపులకు పాల్పడిన కేసును గురువారం నెల్లూరు రూరల్ డిఎస్పి హరనాథ్ రెడ్డి ఎస్ఐ ఇంద్రసేనా రెడ్డితో కలసి విచారించారు. మండలంలోని చిన్నచెరుకూరు గ్రామానికి చెందిన డాక్టర్ వేమారెడ్డి ప్రభాకర్ రెడ్డి అక్రమణలో వున్న వరిగొండ పంచాయతీ పరిధి చిన్నచెరుకూరు-రావూరు వారికండ్రిగ గ్రామాల మధ్య 70 ఎకరాల ప్రభుత్వ (ఈనాం) భూములను భూమి లేని నిరుపేదలకు పంచి పెట్టాలంటూ వ్యవసాయ కార్మిక సంఘం ఆందోళన చేపట్టింది. ఈ నేపథ్యంలో మల్లికార్జున పురం గ్రామానికి చెందిన వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధి, దళిత మహిళ కాల్తిరెడ్డి రమణమ్మను ఆక్రమణదారుడు డాక్టర్ వేమారెడ్డి ప్రభాకర్ రెడ్డి కుమారుడు జయ కార్తీక్ రెడ్డి కులం పేరుతో దూషించి బెదిరించారు. దీనిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కార్తీక్ రెడ్డి పై పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. దాంతో డిఎస్‌పి హరినాథ్‌రెడ్డి బాధితురాలు రమణమ్మను విచారించారు. ఇనాం భూముల వివరాలను సిపిఎం మండల కార్యదర్శి వేగూరు వెంకయ్య డిఎస్పి హరనాథ్ రెడ్డికి వివరించారు. కులదూషణ కేసు విచారణ సమయంలో తోటపల్లిగూడూరు సిపిఎం ప్రతినిధులు పచ్చా మధు, ఉండ్రాళ్ల శ్రీనివాసులు, సుబ్బయ్య ఉన్నారు.

ములాయం సింగ్ యాదవ్ సంస్మరణ సభ

నెల్లూరు : సమాజ్‌వాదీ లోహియా వాహిని జాతీయ కార్యదర్శి ఏ హరీష్ యాదవ్ ఆధ్వర్యంలో సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకులు ములాయం సింగ్ యాదవ్ సంస్మరణసభ నగరంలోని టౌన్‌హాల్ రీడింగ్ రూమ్ లో బుధవారం జరిగింది. సభకు ముఖ్య అతిథిగా డాక్టర్ మాదాల రాజేష్ జి.సుధాకర్ యాదవ్ పాల్గొని మాట్లాడారు. ములాయం సింగ్ యాదవ్ అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్ లోని ఒక కుగ్రామంలో జన్మించి బడుగు బలహీనవర్గాల సమస్యలపై పోరాడాలని సంకల్పంతో రాజకీయ పార్టీని స్థాపించి మూడు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారని కొనియాడారు. భారతదేశానికి రక్షణ మంత్రిగానూ సేవలందించారన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలనాన్రు. పి. లీలా మోహన్ ,పి.ఆదిత్య సాయి,యు. మురళీకష్ణ ,వెంటరమణ ,రావురమేష్ ,వాసురు హరి కుమార్ ,పథ్వీ రాజ్ ,జోసెఫ్ పాల్గొన్నారు..

బిసిల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

కందుకూరు : దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న బిసిల అభివృద్ధికి కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం కందుకూరు నియోజక వర్గ అధ్యక్షుడు కుంచాల వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం ఆయన కార్యలయం లో సంఘం సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. బిసిల సామాజిక, ఆర్థిక,రాజకీయ ప్రగతికి ప్రభుత్వాలు నిర్మాణాత్మక చర్యలు చేపట్టాలన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

గుడ్లూరు :ప్రధానమంత్రి మాతత్వ యోజన అభియాన్ పథకం కింద గుడ్లూరు వైద్య ఆరోగ్య కేంద్రం లో మండలంలోని రావూరు మినీ వైద్య ఆరోగ్య కేంద్రంలో రెండు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి 70 మంది గర్భవతులని పరీక్షించి వారికి అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు.డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ ప్రియాంక పాల్గొన్నారు. వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై సర్పంచ్ అసహనం

కందుకూరు : కొండి కందుకూరులో అధికారులు వ్యవహరిస్తున్న తీరు ఆవేదన కలిగిస్తుందని ఆ గ్రామ సర్పంచ్ కుమ్మర బ్రహ్మయ్య పేర్కొన్నారు. బుధవారం ఆయన ఇక్కడ మాట్లా డారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం విజయవంతానికి సహాయ, సహకారాలు అందించాలని కోరిన అధికారులు ఆ కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలు తన దష్టికి తీసుకొని రావటంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించారో చెప్పాలన్నారు. అదే విధంగా తనకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా అవసరం లేని చోట సైడ్ కాలవలు ఏర్పాటు చేయడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. గ్రామంలో చిన్నపాటి గొడవలను సామరస్యంగా పరిష్కరించాల్సిన అధికారులు కేసులు కట్టి గ్రామంలో వివాదాలు సష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. వాస్తవాలను కప్పిపుచ్చి శాసనసభ్యులకు అవాస్తవాలు తెలియజేస్తూ సమస్యలను పక్క దారి పట్టిస్తున్నారని బ్రహ్మయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

ప్లాస్టిక్ నివారణపై అవగాహన

కందుకూరు : కందుకూరు పురపాలక సంఘములో గత నెలరోజులుగా తడి చెత్త ,పొడి చెత్త, ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు కమిషనర్ ఎస్ మనోహర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా రోజుకు ఒక వార్డు చొప్పున ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. పట్టణంలోని గుర్రంవారి పాలెంలో గల డంపింగ్ యార్డులో పేరుకుపోయిన వ్యర్థాలను పూర్తిస్థాయిలో శుద్ధి కార్యక్రమాలు నిర్వహించడం ప్రారం భంమైం దన్నారు. బుధవారం కమీషనరు మనోహర్ డంపింగ్ యార్డులో జరుగుతున్న పనులను పర్యవేక్షించి అక్కడ పనిచేయు సిబ్బందికి సూచనలు చేశారు.

వైసిపి అక్రమాలపై చర్చకు సిద్ధం : టిడిపి

లింగసముద్రం : వైసిపి అధికారంలోకి వచ్చిన మూడేళ్ల కాలంలో టిడిపి కార్యకర్తలపైన పెట్టిన అక్రమ కేసులు గురించి, అక్రమ ఇసుక,గ్రావెల్,మద్యంపైనా చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, టిడిపి మండల అధ్యక్షులు వేముల గోపాలరావు ,మరికొంత మంది టిడిపి నాయకులు తెలిపారు. బుధవారం స్థానిక టిడిపి కార్యలయంలో వారు మాట్లాడారు. వైసిపి నేతల సవాల్‌కు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. మాల కొండలో ప్రమాణానికి కూడా సిద్ధం కావాలని ప్రతి సవాల్ విసిరారు. తిమ్మారెడ్డిపాలెంలో జరిగిన ఉపాధి హామీ పనులు గురించి, లింగసముద్రంలోని లైబ్రరి, సర్వేనెంబర్ 80బై13లో నిర్మించిన అక్రమ కట్టడం గురించి చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. సమావేశంలో టిడిపి నాయకులు బొల్లినేని నాగేశ్వరరావు, అడపా రంగయ్య,గాలంకి ప్రసాద్,తిరుపతినాయుడు,గాలంకి ప్రసాద్, పొలిమేర నాగిరెడ్డి, గొల్లపల్లి వెంకటేశ్వర్లు,ముసల్లయ్య, ఎం మహేష్,మద్దెల రామారావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టిడిపి నాయకులు

నియామపక పత్రం అందజేత

కందుకూరు :కందుకూరు అర్బన్ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిదిలోని ఉప్పుచేరువు అంగన్‌వాడీ సెంటర్‌లో ఉన్న హెల్పేర్ పోస్టుకు నియమితులైన ఎస్‌కె.కరీమాకు జాయినింగ్ ఉత్తర్వులను ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి అందజేశారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమకంలో సిడిపిఓ అంజమ్మ పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రంలో పరిశీలన

ప్రజాశక్తి-సీతారామపురం

మండలంలోని పబ్బులేటిపల్లిలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని బుధవారం ఇఒపిఆర్‌డి ఎస్.భార్గవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని సేంద్రియ ఎరువుల తయారీ ద్వారా పంచాయతీ ఆదాయం పెంచాలని ఆదేశించారు. వానపాములను వదలటం జరిగిందన్నారు. సచివాలయం సిబ్బంది వాలంటీర్స్ అందరూ జగనన్న స్వచ్ఛ సంకల్ప కార్యక్రమాన్ని సక్రమంగా అమలు జరిగేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తడి చెత్త పొడి చెత్తను వేరు చేయాలని, గ్రీన్ అంబాసిడర్లు ఇచ్చిన పరికరాలను వాడి సెకండ్ లెవెల్ సెగ్రిగేషన్‌ను వేగవంతం చేయాలన్నారు. గ్రామాల్లో రోడ్డు పక్కన చెత్త పడేయక చెత్త నుండి సంపద తయారీ కేంద్రం వద్దకి తరలించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జోష్ణ, గ్రీన్ అంబాసిడర్స్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-కావలి

మాట్లాడుతున్న డాక్టర్ సుధీర్‌కుమార్

గుండెమడుగుల దేవదానం మెమోరియల్ హాస్పిటల్‌లో ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ ఎన్.ప్రభాకర్ నాయుడు సూచనలు, సలహాలు మేరకు, కావలి వెంగళరావునగర్ లోని బీసీ బాలుర వసతి గృహం-1, బిసి బాలుర వసతి గృహం-2లోని 120మంది విద్యార్థులకు బుధవారం గుండె వ్యాధి, దంత వ్యాధి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కావలి సహాయ బిసి సంక్షేమ అధికారి కె.సుధాకర్ సహకారంతో వసతి గృహ విద్యార్థులకు వైద్య సహాయం సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ డి.సుధీర్‌కుమార్, డాక్టర్ వినయ్‌వినోద్‌బాబు, విశ్రాంత వసతి గృహ సంక్షేమాధికారి షేక్ ఖాదర్‌బాషా, వసతి గృహ సంక్షేమాధికారులు సాల్మన్ రాజు, చలపతి, డాక్టర్ ప్రభాకర్ నాయుడుకి, వసతి గృహ సంక్షేమాధికారి రవికుమార్, హాస్టల్ సిబ్బంది, హాస్పిటల్ పిఆర్‌ఒ ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ కవి ఇక్బాల్ జయంతి

ప్రజాశక్తి-అనంతసాగరం

ఆవాజ్ మండల కమిటీ అధ్వర్యంలో ప్రముఖ కవి ఇక్బాల్ జయంతి కార్యక్రమం స్థానిక హై స్కూల్లో బుధవారం జరిగింది. ఈ జయంతి కార్యక్రమానికి ఆవాజ్ కమిటీ కార్యదర్శి ఎస్‌డి ఇప్తికర్ పాల్గొన్నారు. హై స్కూల్ హెడ్ మాస్టర్ ఝాన్సీ, సాని సాహెబ్, ఇతర ఉపాధ్యాయులు ఇక్బాల్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు అన్వర్ బాషా, హైస్కూల్ ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, మహబూబ్‌బాషా, తదితర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

11,12తేదీల్లో 'జెబి'లో ఆటల పోటీలు

ప్రజాశక్తి-కావలి

11, 12 తేదీల్లో విక్రమ సింహపురి యూనివర్సిటీ అంతర్ కళాశాలల ఆటల పోటీలకు కావలి జవహర్ భారతి డిగ్రీ కళాశాల ఆతిథ్యమిస్తుంది. ఇందులో బాస్కెట్ బాల్ (మెన్), ఫుట్ బాల్, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్ సింగిల్స్ అండ్ డబుల్స్ పోటీలు జరుగుతాయి. సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అన్ని కళాశాలలు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని వీటిని దిగ్విజయం చేయవలసిందిగా ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ పి.ప్రసాద్ రెడ్డి ప్రకటనలో కోరారు.

నిత్యావసరాలు వితరణ

ప్రజాశక్తి-కావలి

సంయుక్త సేవాసంస్థ ఉచిత కుట్టు శిక్షణ కేంద్రంలో బుధవారం ముసునూరు, వినాయక కాలనీలో పుట్టుకతోనే దివ్యాంగులుగా జన్మించిన లింకమ్మ రావు, శ్రీను సంరక్షణ కోసం సంస్థ సభ్యుల సహకారంతో నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు, బియ్యం, మందులకోసం రూ.1000 నగదును అందజేశారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర, కావలి రూరల్ పోలీసు కానిస్టేబుల్ జె.రమేష్ కుమార్, కరవది.భాస్కర్ పాల్గొని దివ్యాంగులకు నిత్యావసర వస్తువులు, బియ్యం, నగదును అందజేశారు. ఈ సందర్భంగా కరవది.భాస్కర్ మాట్లాడుతూ సంయుక్త సేవాసంస్థ ద్వారా చేస్తున్న సేవలను, సంస్థ సభ్యులను అభినందించారు. ముఖ్యంగా మంచానికి పరిమితమైన దివ్యాంగులు అంకమ్మ రావు, శ్రీను సంరక్షణకై కొన్ని నెలలుగా సంయుక్త సేవా సంస్థ సభ్యులు అందజేస్తున్న సేవలు అమోఘమన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం నాగులవరం గ్రామస్తులు కాంట్ర సతీష్ నాయుడు భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రంలో అనాథ బాలలకు రూ.15000 విలువ గల నిత్యావసర వస్తువులు ప్రభుత్వ మాజీ ప్లీడర్ పోట్లూరి శ్రీనివాసులు అందజేశారు. ఈ సందర్భంగా పోట్లూరి శ్రీనివాసులు మాట్లాడుతూ కాంట్ర సతీష్‌నాయుడు దాతృత్వం ప్రశంసనీయమని తన సహాయం వల్ల నెలరోజులపాటు అనాథ బాలలు సంతోషంగా భోజనం చేయడం గొప్పవిషయమన్నారు. ఆదరణ కేంద్రం డైరెక్టర్ కట్టిపల్లి సింహాద్రి రావు మాట్లాడుతూ సతీష్ నాయుడు ఆదరణ కేంద్రంలో సతీష్‌నాయుడు చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన నాయకులు బాపట్ల వెంకటపతి, జయరావు కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వెంకటేశ్వరలో ఫెన్సింగ్ సెలక్షన్స్

ప్రజాశక్తి-కొడవలూరు

మండలంలోని నార్త్ రాజుపాలెం శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో భారతదేశంలోని వివిధ చెందుతున్న ఫెన్సింగ్ గేమ్ క్రీడను నాణ్యమైన ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సులలో శ్రీ వెంకటేశ్వర విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించడమేకాక ఏర్పాటు చేశారు. ఫెన్సింగ్ క్రీడలో జిల్లాలోని గోల్డ్ మెడల్ ఆంధ్ర ప్రస్థ పోటీలలో సిల్వర్ మెడల్ సాధించి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ సాప్ ఎస్ ఏపి వారిచే ప్రత్యేక ప్రశంసలు పొందారు. వెంకటేశ్వర కళాశాలలోని అధునాతన ఇండోర్ క్రీడ ప్రాంగణంలో గురువారం జరుగుతుందని కళాశాల చైర్మన్ పెనుబల్లి బాబు నాయుడు విలేకరుల సమావేశంలో తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కుమార్ బాబు మాట్లాడుతూ జేఎన్టీయూ ఫెన్సింగ్ టీం సెలక్షన్ కు ఆంధ్రప్రదేశ్ లోని జేఎన్టీయూ పరిధి ఇంజనీరింగ్ కాలేజీ కళాశాల నుండి సుమారు 100 మంది విద్యార్థిని విద్యార్థులు 20 మంది కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ హాజరవుతారని తెలిపారు.

ఆటో దగ్ధం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

పట్టణంలోని జెఆర్‌పేట ప్రాంతంలో ఇంటి ముందు నిలిపి ఉన్న బాబు అనే వ్యక్తికి చెందిన ఆటోను బుధవారం పలువురు గుర్తు తెలియని వ్యక్తులు తగలబెట్టారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. గత ఐదు సంవత్సరాలుగా ఆటో నడుపుకుంటూ కుటుంబ పోషణ చేసుకుంటూ జీవిస్తు ఉన్నామన్నారు. రోజూలాగే ఇంటి ముందు ఆటోను నిలుపుకొని ఇంట్లో నిద్రపోతుండగా తెల్లవారుజామున 4 గంటల సమయంలో కుక్కలు భారీగా అరుస్తూ ఉండడంతోపాటు తమ ముందు ఇంటి ఆండే ఒక పాప ఫోన్ చేయడంతో బయటికి వచ్చి చూడగా అప్పటికే ఆటో తగలబడుతున్నాయన్నారు. వెంటనే నీళ్లను తెచ్చి ఆపివేసామని తెలిపారు. అప్పటికే ఆటో పూర్తిగా కాలిపోయినట్లు ఆటో ఓనర్ బాబు తెలిపాడు. తనకు ఎవరిపై అనుమానం లేదని, ఇలా ఎందుకు జరిగిందో తెలియడం లేదని, ఆటోపై ఆధారపడే జీవించే తన కుటుంబం వీధిలో పడ్డామని బోరున విలపించాడు. ఆటో తగలబడిన విషయం ఆటో ఏజెన్సీ వారికి తెలిపి ఆత్మకూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

పలుచోట్ల గడపగడపకు మన ప్రభుత్వం

వుడ్‌హౌస్ పేటలో గడపగడప కార్యక్రమంలో పాల్గొన్న కావలి ఎంఎల్‌ఎ రామిరెడ్డి

ప్రజాశక్తి-అల్లూరు

అల్లూరు నగర పంచాయతీ పరిధి వుడ్‌హౌస్‌పేట గ్రామంలో బుధవారం కావలి ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి గడప గడపకు కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలిసారిగా అల్లూరు గడపలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికి పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 రోజులపాటు అల్లూరు నగర పంచాయతీలో ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహిస్తామన్నారు. జగనన్న సంక్షేమ ఫలాలతో 50 వేల నుండి 13 లక్షల వరకు పేద ప్రజలు లబ్ధి పొందుతున్నారని వివరించారు. ప్రధానంగా పింఛన్లు, ఆసరా, చేయూత, అమ్మఒడి, ఇళ్ల స్థలాలు, ఇళ్లు నిర్మించి ఇవ్వడంతో నాయకులు ఎక్కడికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అధికారంలో ఉంటే అధికార పార్టీ నాయకులు ప్రజల వద్దకు వెళ్లాలంటే భయ పడతారని కానీ ముఖ్యమంత్రి చేసిన అభివృద్ధి ఫలితంగా ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారని వ్యాఖ్యానించారు. అక్కా చెల్లెమ్మలు తమ బిడ్డల్ని చదివించుకోవాలంటే గతంలో అనేక ఇబ్బందులు పడుతూ ఉండేవారని ప్రస్తుతం ప్రభుత్వ పథకాలతో మంచి చదువులు చదువుకుంటున్నారని గుర్తు చేశారు. నాడు-నేడు పనులతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్ధశ పట్టిందని తెలియజేశారు. కార్యక్రమంలో కావలి ఎఎంసి చైర్మన్ మన్నెమాల సుకుమార్ రెడ్డి, వైసిపి నాయకులు సామంతుల సురేష్‌రెడ్డి, కోడూరు సాదక్ కుమార్ రెడ్డి, ఎంపిపి దర్శిగుంట శశిరేఖ, తహశీల్దార్ శ్రీరామకృష్ణ, ఎంపిడిఒ శ్రీదేవి, అల్లూరు నగర పంచాయతీ కమిషనర్ ఫణి కుమార్, ఎంఇఒ నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ప్రజాశక్తి-వింజమూరు : ప్రజలందరి అభివృద్ధి కోసం వారి సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పని చేస్తున్నారని ఆయన చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించేందుకే గడపగడపకు కార్యక్రమాన్ని రూపకల్పన చేశారని ఎంఎల్‌ఎ మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని శంకవరం గ్రామంలో అలాగే వెంకటాద్రిపాలెంలో గడపగడప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తండ్రిని మించిన పరిపాలన సాగిస్తున్నారని తెలిపారు. అందుచేతనే ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా రాష్ట్ర పథకాలను అమలు చేసేందుకు సిద్ధపడుతున్నారన్నారు. రాజశేఖర్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు కంటే మిన్నగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలుపరుస్తున్నారని తెలిపారు. మళ్లీ సిఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నుకోవాలని సూచించారు. ఆయనవెంట మండల కన్వీనర్ రేవనూరు శ్రీనివాసులురెడ్డి సొసైటీ అధ్యక్షులు జూపల్లి రాజారావు, ఎంపిడిఒ స్వరూపరాణి, కార్యదర్శి సురేష్, స్థానిక నాయకులు లెక్కల సుధాకర్‌రెడ్డి, లింగాలదిన్నె శేఖర్‌రెడ్డి, గోత్రం హజరత్తయ్య, లెక్కల వెంకటనారాయణ, వెనుతుర్ల నాగిరెడ్డి, చింతలమైన పెంచలయ్య, సానం రమణారెడ్డి, పోలుబోయిన వెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వింజమూరులో ఎంఎల్‌ఎ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి

కోవూరులో ఎసిబి సోదాలు

ప్రజాశక్తి-కోవూరు

జిల్లా పౌర సరఫరాల శాఖలో ధాన్యం కొనుగోళ్లకు సంభందించిన సుమారు 40 కోట్ల రూపాయలు కాజేసిన కేసులో అవినీతి నిరోధక శాఖ రంగంలోకి దిగింది. రూ.40 కోట్లు కాజేసిన కుంభకోణంలో మొత్తం 32 మందిని దోషులుగా తేల్చారు. వారిలో కొందరు అధికారులు కాగా మిగిలిన వారు కాంట్రాక్ట్ ఉద్యోగులు. ఈ కేసులో ప్రధాన నిందితులుగా పౌరసరఫరాల శాఖ డిఎం పద్మ, కంప్యూటర్ ఆపరేటర్ శివ ఉన్నారు. ఇప్పటికే వారిని పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపారు. పద్మను, శివను విధుల నుంచి సస్పెండ్ చేశారు. అధికారులు. ఈ కేసును రెండు రోజుల క్రితం డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డి అవినీతి నిరోధక శాఖకు బదిలీ చేశారు. దీంతో బుధవారం రంగంలోకి దిగిన నెల్లూరు ఎసిబి అధికారులు 11 చోట్ల సోదాలు చేపట్టారు. నెల్లూరులోని మాజీ డిఎం పద్మ నివాసంతో పాటూ కంప్యూటర్ ఆపరేటర్ శివ నివాసంలో ఎసిబి బందాలు సోదాలు చేపట్టాయి.

ధనలక్ష్మిపురంతో పాటూ భక్తవత్సల నగర్‌లోని వారి నివాసాలతో కోవూరు, ఇనమడుగు చెందిన సివిల్ సప్లయ్ స్టేజ్ టు కాంట్రాక్టర్ దయాకర్ రెడ్డి నివాసాన్ని ఏసీబీ అధికారులు సీజ్ చేశారు. సోదాలకు వచ్చిన ఏసీబీ అధికారులు దయాకర్ రెడ్డి ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఇల్లును సీజ్ చేయడంతో పాటూ ఒక్క నెల్లూరులోనే 8 చోట్ల తనిఖీలు చేపట్టారు. విజయవాడలోని మాజీ డిఎం పద్మ మామయ్య నివాసంలో కూడా ఏసిబి అధికారులు సోదాలు నిర్వహించారు. సోదాల్లో ఏమైనా రికార్డులు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారా లేదా అనే విషయం అధికారులు ప్రకటించాల్సి ఉంది.

క్రీడలలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

ఎఎస్‌పేట ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆత్మకూరు నియోజకవర్గ క్రీడలలో విజయం సాధించి జిల్లాలో జరిగే క్రీడలలో పాల్గొనేందకు ప్రతిభ చూపడంపై ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు అబ్దుల్ హమీద్ ఆనందం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గ పాఠశాల స్థాయి కబడ్డీ, ఖోఖో, టెన్నికోయిట్, యోగ క్రీడలలో ఉన్నత పాఠశాల, విద్యార్థులు ప్రతిభ చూపించి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు.

అభిమానుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేస్తున్న కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి

మాజీ ఎంఎల్‌ఎ కాటంరెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అల్లూరు

అల్లూరు మాజీ ఎంఎల్‌ఎ కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి 64వ జన్మదిన వేడుకలను బుధవారం ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం స్థానిక ఆయన నివాస గృహం నుండి భాజాభజంత్రీలతో భారీ ర్యాలీ చేపట్టి వినాయకుడి గుడి వద్దకు చేరుకొని ప్రత్యేక పూజలు చేపట్టారు. తదుపరి బాణసంచా పేల్చి కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. అంతేకాకుండా రాజకీయాలలో తన కంటూ ఒక చెరగని ముద్ర వేసుకుని నిరంతరం పేద ప్రజల కోసమే ఆయన జీవితాన్ని త్యాగం చేశారని తెలిపారు. సాగునీటి వ్యవహారంలో రైతుల కోసం అనేక పోరాటాలు చేసి రైతు బాంధవుడిగా పేరొందారన్నారు. బిట్రగుంట లోకోషెడ్డు కోసం అనేక ధర్నాలు చేపట్టి సమస్యను ఢిల్లీ స్థాయికి తీసుకువెళ్లారని వివరించారు. తరువాత ఎన్నికైన ఏ ఎంఎల్‌ఎ అయినా లోకో షెడ్డు వైపు కన్నెత్తి చూడలేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. వైద్యం కోసం ఎవరైనా ఆయనను సంప్రదిస్తే స్వయంగా వైద్యులకు ఫోన్ చేసి వారి ఖర్చులకు నగదను ఇచ్చేవారని తెలియజేశారు. అలాంటి మహోన్నత వ్యక్తిని ఈ దఫా కావలి ఎంఎల్‌ఎగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎరటిపల్లి శేఖర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, బాలురెడ్డి, సయ్యద్ దిలీప్, పప్పు సుధాకర్, తదితరులు ఉన్నారు.

దళితులకు న్యాయం జరిగే వరకూ దీక్ష

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

చేజర్ల మండలం పెళ్లేరు గ్రామానికి చెందిన దళితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉండి దీక్ష కొనసాగిస్తామని బిఎస్‌పి నియోజకవర్గ అధ్యక్షుడు నందా ఓబులేసు పేర్కొన్నారు. బుధవారం ఆత్మకూరు ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట దీక్ష ప్రారంభించి 16వ రోజుకు చేరినప్పటికీ దళితులకు న్యాయం జరగకపోవడం బాధాకరమన్నారు. ఆక్రమణకు గురైన పెన్నా పరివాహక ప్రాంత 800 ఎకరాలు ప్రభుత్వం స్వాధీనం చేసుకునేంత వరకు, విద్యుత్ కనెక్షన్లు తొలగించేంత వరకు, వాటికి ఎన్ఒసి ఇచ్చిన వారిపై చర్యలు తీసుకొనే వరకు దీక్ష కొనసాగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గం ఇన్‌ఛార్జి చెన్నుపల్లి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి టి.కృష్ణ, నియోజకవర్గం సోషల్ మీడియా కో ఆర్డినేటర్, టౌన్ అధ్యక్షులు ఆత్మకూరు వెంకటేష్, ఉపాధ్యక్షులు శ్యామ్, 1వ వార్డ్ ఇన్‌ఛార్జి చప్పిడి కుమార్, బిఎస్‌పి నాయకులు రజనీకాంత్, ధర్మయ్య, శ్రీను పెళ్లేరు దళితులు పాల్గొన్నారు.

దీక్ష చేపడుతున్న బిఎస్‌పి నేతలు

నాడు-నేడు పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మండలంలో జరుగుతున్న నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపిడిఒ సి.శ్రీనివాసులు తెలియజేశారు. బుధవారం ఆత్మకూరు మండలంలోని మహిమలూరు జెడ్‌పిహెచ్‌ఎస్‌లో జరుగుతున్న నాడు-నేడు పనులను ఆయన పరిశీలించారు. అక్కడ దాదాపు రూ.12లక్షల 61 వేల వ్యయంతో జరుగుతున్న నూతన మరుగుదొడ్లు, వంట గది, ఇతర మైనర్ రిపేరు పనులు ఆయన పరిశీలించారు. ఇటీవలే జిల్లా కలెక్టర్ హైస్కూల్‌ను పరిశీలించి అదనంగా మరో 5 రూములు మంజూరు చేశారన్నారు. ఈ మేరకు ఒక్కొక్క రూముకు రూ.12లక్షలతో మొత్తం 60 లక్షలకు ప్రతిపాదనలు సమర్పించామని తెలిపారు. ఈ పరిశీలనలో విద్యా కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి పి.భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

పనులు పరిశీలించిన ఎంపిడిఒ శ్రీనివాసులు

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

ప్రజాశక్తి-నెల్లూరు

సొసైటీ ఫర్ ది అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ (ఎస్ఎఎల్ఐఎస్) నెల్లూరు చాప్టర్ చైర్మన్ కిరణ్‌కుమార్, సెక్రటరీ విజయమహేష్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం నేషనల్ లైబ్రరీ వీక్ పురస్కరించుకొని, దర్గామిట్టలోని జెడ్‌పి బాలికల పాఠశాలలో విద్యార్థులకు "హౌ టు ఇంప్రూవ్ రీడింగ్ హాబిట్స్ అమౌంగ్ ది స్కూల్ చిల్డ్రన్" అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ, జనరల్ నాలెడ్జ్‌పై క్విజ్ కార్యక్రమాలను నిర్వహించారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులలో గ్రంథాలయాల విశిష్టతను, విద్యార్థులలో పుస్తక పఠనం ఆవశ్యకతను, ఆసక్తిని పెంపొందించడానికి తోడ్పడుతాయని కమిటీ తెలియజేశారు. కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సిరివెన్నెలకు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యార్థులందరూ ఎంతో ఆసక్తితోపై పోటీలలో పాల్గొనడం ఎంతో ఆహ్వానించదగ్గ పరిణామమని తెలియజేశారు.

విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎస్ఐ

విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-ఉదయగిరి

పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మారుతున్న కాలంలో పోలీసుల పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎస్ఐ అంకమ్మ బహుమతులు ప్రదానం చేశారు. బుధవారం పట్టణంలోని ప్రగతి జూనియర్ కాలేజీలో పోటీలో గెలుపొందిన మొదటి బహుమతి కంభంపాటి జయశ్రీ, రెండో బహుమతి షేక్ సాధియ, మూడో బహుమతి షేక్ జాస్మిన్‌లకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు సత్ప్రవర్తనతో ఉన్నత విద్యను అభ్యసించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు కాలేజీ సిబ్బంది మైనుద్దీన్, భాస్కర్, మౌలాలి, షబ్బీర్, రాజశేఖర్ రెడ్డి, పలువురు సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

న్యాయ సేవా దినోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి-కావలి : న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా బుధవారం కావలి న్యాయమూర్తులు, న్యాయ వాదులు, కోర్టు సిబ్బంది కోర్టు భవనం నుండి ఉదయగిరి బ్రిడ్జి వరకు ర్యాలీలో పాల్గొన్నారు. సీనియర్ సివిల్ జడ్జీ ఎం.శోభా మాట్లాడుతూ కావలి మండలన్యాయ సేవా అధికార సంస్థ 9 నవంబర్ 2021 నుండి ఇప్పటి వరకు 73 చట్టాలపై అవగాహన సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. దానికి గాను 3584 మంది హజరయ్యారన్నారు. అడిషనల్ మెజిస్ట్రేట్ అన్నపూర్ణశ్రీ మాట్లాడుతూ 12న నేషనల్ లోక్‌అదాలత్ జరుగుతుందన్నారు. ఈ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీకి ప్రయత్నించాలని పోలీసులకు, న్యాయవాదులకు సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ మేజిస్ట్రేట్ పరసురామ్, కావలి బార్ అసోషియేషన్ ప్రెసిడెంటు సురేందర్‌రెడ్డి, న్యాయవాదులు, పోలీసు సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

కావలిలో..

ఆత్మకూరులో..

ప్రజాశక్తి - ఆత్మకూరు అర్బన్ : జాతీయ న్యాయసేవా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని సబ్‌కోర్టు ఆవరణంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్ ఎం.వెంకటేశ్వర్లు, షేక్ సిరాజుద్దీన్, ఎల్‌వి రమణయ్య బుధవారం న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా చట్టాల గురించి వాటి విశిష్టత గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రజలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

అక్షర చైతన్యంపై శిక్షణ

ప్రజాశక్తి-సీతారామపురం

మాట్లాడుతున్న ఎంపిడిఒ

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ పి.ఐజాక్ ప్రవీణ్ ఆధ్వర్యంలో అడల్ట్ ఎడ్యుకేషన్ సూపర్‌వైజర్ అంకారావు సమక్షంలో అక్షర చైతన్యం-2 కార్యక్రమం గురించి మండలంలోని అన్ని సచివాలయాలకు సంబంధించిన వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, మహిళా శిశుసంక్షేమ కార్యదర్శిలకు సంయుక్తంగా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వాలంటీర్స్ ద్వారా నిరక్షరాస్యులను గుర్తించి కార్యాచరణ ప్రాణాలిక తయారుచేసుకొని అందరినీ 100శాతం అక్షరాస్యులుగా తయారు చేయాలన్నారు. ఇఒపిఆర్‌డి భార్గవి పాల్గొని వెల్ఫేర్ అసిస్టెంట్లకు, మహిళా పోలీసులకు అక్షర చైతన్యం-2 గురించి దిశా నిర్దేశం చేశారు. గతంలో జరిగిన అక్షర చైతన్యం ఫేస్-1లో మండలంలో చాలామందిని అక్షరాస్యులుగా చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయాల వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన వైద్యం

- పెరుగుతున్న రోగుల సంఖ్య
- నిత్యం అందుబాటులో వైద్యులు
- వైద్య సేవలు బాగున్నాయని ప్రశంసా

ప్రజాశక్తి-అల్లూరు

మండల కేంద్రం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో గత కొద్ది నెలల నుండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో రోగులు ప్రభుత్వ వైద్యశాల వైపు మొగ్గు చూపుతున్నారు. గతం కన్నా భిన్నంగా వైద్యులు అందుబాటులో ఉండడంతో ప్రజలు డాక్టర్లను దేవుళ్లుగా కొలుస్తూ ప్రశంసలు కురిపిస్తున్నారు. నూతన పాలసీ విధానాలతో సామాజిక ఆరోగ్య కేంద్రంగా 50 పడకలతో అన్ని హంగుల ఆర్భాటాలతో వైద్యశాలను నిర్మించారు. వైద్యశాల మార్పు చెందిన నాటినుండి అందుబాటులో వైద్యులు లేక సిబ్బంది నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించేవారు. అనేక సందర్భాలలో రోగులు సిబ్బంది తీరుపై అసహనం వ్యక్తం చేశారు. రాత్రి సమయాలలో వివిధ గ్రామాల నుండి వైద్యం కోసం వచ్చిన ఎంతోమంది సిబ్బంది మాటతీరు నచ్చక వాగ్వాదానికి దిగిన సంఘటనలు కోకొల్లుగా ఉన్నాయి. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించేవారు కాదని కాగా విసుగు చెందిన గ్రామస్తులు చేసేదేమీ లేక ప్రయివేటు వైద్యశాలలపై మొగ్గు చూపేవారు. కొంతమంది నిరుపేదలు నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొంది ఇంటికి చేరుకునేవారు. కావలి ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి, కావలి ఎఎంసి చైర్మన్ మన్నెమాల సుకుమార్ రెడ్డి కరోనా దశలో పలుమార్లు వైద్యశాలకు విచ్చేసి ఆయా కార్యక్రమాలు నిర్వహించే తరుణంలో గ్రామస్తులు వైద్యులను ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఇక్కడ వైద్యులు, సిబ్బంది వ్యవహరించే తీరుపై పూస గుచ్చినట్లు అధికారుల ఎదుటే నేతలకు వివరించారు. అంతేకాకుండా వైద్యులను నిలదీసి వాగ్వాదానికి దిగారు. ఎంఎల్‌ఎ స్పందిస్తూ సంబంధిత విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లానని త్వరలో వైద్యులను ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. అయినా ఒక వైద్యురాలు ఆయన మాట కూడా వినకుండా సెలవు పెట్టి వెళ్లిపోయి వైద్యశాలకు వచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెప్పినట్లు సమాచారం. కాగా ప్రజలకు ప్రభుత్వ వైద్యశాలపై పూర్తిగా నమ్మకం పోయిన తరుణంలో దాదాపు ఒకటిన్నర నెల నుండి వైద్యులు విస్తృత సేవలు అందించడంతో ప్రభుత్వ వైద్యశాలకు ప్రజలు పరుగులు తీస్తున్నారు. సిబ్బందితీరు, వైద్యం బాగుండడంతో వైద్యశాలకు పూర్వ వైభవం వచ్చిందని ప్రజలు అంటున్నారు. రాత్రి సమయాలలో ఒక డాక్టరు పగటిపూట సుమారు 7 మంది వైద్యులలు చిన్న నుండి పెద్ద వరకు సేవలు అందిస్తున్నారు.

ప్రభుత్వ వైద్యశాలలో అధికంగా ఉన్న రోగులు

ఈ సందర్భంగా డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు ఎమ్‌డి డిప్యూటీ సివిల్ సర్జన్ మాట్లాడుతూ స్టేట్ గవర్నమెంట్ రీస్ట్రక్చర్ పాలసీ ప్రకారం 50 పడగల ప్రభుత్వ వైద్యశాలకు 12 మంది డాక్టర్లు అదేవిధంగా 30 పడకల వైద్యశాలకు 6 మంది డాక్టర్లు ఉండాలని వివరించారు. అందులో భాగంగా ఈ వైద్యశాలకు ఇప్పుడిప్పుడే అన్ని సౌకర్యాలు సమకూర్చు కుంటూ ప్రస్తుతం 7మంది విధులు నిర్వహిస్తూ రాత్రి సమయంలో అత్యవసర సేవలు అందించేందుకు ఎప్పుడు ఒక డాక్టర్ అందుబాటులో ఉంటారని హామీనిచ్చారు. ప్రస్తుతం జనరల్ సివిల్ సర్జన్, గైనకాలజిస్ట్, ఆర్థోపెడిక్, కంటి వైద్య నిపుణులు జనరల్ డ్యూటీ డాక్టర్, మత్తు డాక్టర్ అందుబాటులో ఉన్నారన్నారు. విషజ్వరాలు, ఊపిరితిత్తుల వ్యాధులు, డయాబెటిస్, కరోనా, టూ బెక్టమియా, మహిళలకు డెలివరీలు, ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే 10 టూ బెక్టమియా 18 డెలివరీలు చేశామని పేర్కొన్నారు. వచ్చిన ప్రతి ఒక్కరికీ వైద్యం అందించడమే తన ప్రధాన లక్ష్యమని తెలియజేశారు. అస్తవ్యస్తంగా ఉన్న ఆపరేషన్ థియేటర్లో అన్ని ఏర్పాట్లు చేసేందుకు నెలరోజుల సమయం పట్టిందని తెలిపారు. పోస్టుమార్టం గది వద్ద జెసిబి తవ్వినందున వైర్లు డామేజ్ అయ్యాయని త్వరలో పునరుద్ధరించి ఇక్కడే పోస్టుమార్టం నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వ వైద్యశాలకు అన్ని హంగులు ఏర్పాటు చేసేందుకు సుమారు 6 నెలల సమయం పడుతుందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో సామాజిక ఆరోగ్య కేంద్రాలు 181 ఉన్నాయని ప్రతినెలా వైద్యసేవలు అందించడంలో పొజిషన్ ప్రకారం 162 స్థానంలో వైద్యశాల వెనుకబడి ఉందని విచారం వ్యక్తపరిచారు. త్వరలో మంచి పొజిషన్‌కు తీసుకువెళ్తానని భరోసానిచ్చారు. గతంలో రోజుకు 30 నుండి 40 మంది పేషెంట్లు వచ్చేవారిని ప్రస్తుతం ప్రతిరోజు 250 మంది పేషెంట్లు వస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. విడవలూరు, రామతీర్థం అలాగే చుట్టుపక్కల మండల ప్రజలు ఇక్కడ వైద్య సేవలు పొందవచ్చునని తెలియజేశారు.



ఈ సందర్భంగా మండలం లోని ఇస్కపల్లి బిఎంఆర్ గిరిజన కాలనీకి చెందిన మేకల తిరుపతమ్మ మాట్లాడుతూ తాను ప్రసవం కోసం ప్రభుత్వ వైద్యశాలకు చేరుకున్న వెంటనే మహిళా గైనకాలజిస్ట్ విచ్చేసి కాన్పు చేశారని వివరించింది. అలాగే ప్రతిరోజు వైద్యులు వచ్చి వెళుతున్నారని ఆమె అన్నారు. తాను ప్రభుత్వ వైద్యశాలకు వచ్చేముందు అనేక అపోహలు ఉండేవని కానీ వైద్యులు, సిబ్బంది తీరు బాగుందని తెలిపారు.

ఈ సందర్భంగా మండలంలోని ఆది నారాయణపురం గ్రామానికి చెందిన శ్రీహరి కోట ప్రసాద్ మాట్లాడుతూ తీవ్ర జ్వరంతో అడ్మిషన్ అయ్యి మంచి వైద్య సేవలు పొందానని వివరించారు. అదే ప్రైవేటు వైద్యశాలకు వెళ్లంటే అధిక ఖర్చుతో నాన్న అగచాట్లు పడే వారమని ఆయన అన్నారు.

ఈ సందర్భంగా మండలంలోని తూర్పు గోగులపల్లి గ్రామానికి చెందిన గోళ్ళ శ్రీనివాసులు మాట్లాడుతూ ఊపిరితిత్తుల్లో నెమ్ము అధికంగా పేరుకుపోయి తీవ్ర ఇక్కట్లు చెందుతూ ప్రభుత్వ వైద్యశాలకు చేరుకున్నామన్నారు. వైద్యుల పరివేక్షణలో 4 రోజులు ఉంచి మంచి వైద్య సేవలు అందించారని వారి రుణం జన్మలో తీర్చుకోలేని ఆయన అన్నారు.